క్లుప్తంగా

లారీ బోల్తా.. వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి : మండలంలోని ఇటిక్యాలపాడు శివారులోని జాతీయ రహదారిపై కారు టక్కరీయడంతో లారీ బోల్తా పడిన ఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. హైదరాబాద్ నుంచి కర్నూలుకు వెళ్తున్న కారు ఇటిక్యాలపాడు శివారులో లారీని ఓవర్ టెక్ చేసే సమయంలో లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలవగా 108లో ఆస్పత్రికి తరలించారు. లారీ పల్లీల లోడుతో మహబూబ్‌నగర్ నుంచి కర్నూల్‌కు వెళ్తున్నట్లు డ్రైవర్ తెలిపారు.

అదుపుతప్పిన బైక్.. వ్యక్తికి తీవ్రగాయాలు



మల్దకల్ : మండలంలోని బిజ్వారం గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు..దాసరపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు అమరవాయిలో ట్రాక్టర్ డ్రైవరుగా విధులు నిర్వహిస్తున్నాడు. విధులు ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో బసవన్న ఆలయం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108లో గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

దుకాణంలో చోరీ.. కేసు నమోదు

శాంతినగర్ : వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ స్టేజీలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగిన ఘటన చోటు చేసుకుంది. బాధితుడు వెంకటేష్ తెలిపిన వివరాలు.. మంగళవారం రాత్రి షెట్టర్‌కు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం షాపునకు వెళ్లి చూడగా రేకుల షెడ్డుకు వెనుక వైపున కన్నం వేసి కాపర్ వైర్ దొంగిలించినట్లు గుర్తించాడు. అనంతరం శాంతినగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏఎస్‌ఐ బాష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ధరూరు : మండల కేంద్రం శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేశారు. ఈ క్రమంలో ఐదుగురిని పట్టుకోగా మరో ముగ్గురు వ్యక్తులు పరారైనట్లు ఎస్సై శ్రీహరి తెలిపారు. పట్టుబడిన వారి వద్ద 5 మోటారు సైకిళ్లు, రూ.3వేల నగదు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఇటిక్యాల : నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన భద్రప్పను బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అల్లాబకాష్, రాజు, చాంద్‌బాషా, శాంతన్న, ఖాజ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

మానవపాడు : మండల కేంద్రంలో బుధవారం తహసీల్దార్‌గా జోషి శ్రీనివాస్‌శర్మ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు, మండల నాయకులు పుష్ప గుచ్ఛం శుభాకాంక్షలు తెలిపారు. గతంలో శ్రీనివాస్‌శర్మ కలెక్టరేట్ విభాగంలోని ప్రజావాణిలో విధులు నిర్వహించారు.

మహాసభ అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వండి

గద్వాల న్యూటౌన్: ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించాలని మిడిదొడ్డి శ్యాంసుందర్ కోరారు. మహాసభ అధ్యక్ష పదవికి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన బుధవారం స్థానిక కన్యాకా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మేడిశెట్టి బాలస్వామి, సంఘం నాయకులు ఆలూరు బిలకంటి రాము, నందిమల్ల సురేష్, నరహరి శ్రీనివాసులు, పత్తి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించండి

అలంపూర్ : పట్టణంలోని సంగమేశ్వర కాలనీ వాసులు విద్యుత్ సమస్య పరిష్కరించాలని విద్యుత్ ఏఈ అఖిల్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తాకడంతో విద్యుత్ సమస్య ఉత్పన్నమవుతునట్లు తెలిపారు. లైన్‌మార్చి ఇబ్బందులు లేకుండా చూస్తామని గతంలో అధికారులు హామీ ఇచ్చి ఆరు నెలలు గడిచిన సమస్యను పరిష్కరించలేదని పేర్కొన్నారు. విద్యుత్ లైన్ మార్చి కొత్త స్తంభాలను వేయాలని కోరారు. కార్యక్రమంలో గోవర్ధన్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రత్యేక దృష్టి
- అదనపు తరగతుల నిర్వహణ



మానవపాడు జెడ్పీహెచ్ఎస్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు(ఫైల్)

మానవపాడు: ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితం సాధించడమే లక్ష్యంగా జిల్లా ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఈ సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు దృష్టి సారించారు.

వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి...

మండలంలోని మానవపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 83 మంది, జల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 77 మంది, చెన్నిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 31 మంది, మానవపాడు కేజీబీవీ పాఠశాలలో 33 మంది విద్యార్థులు మొత్తం 224 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. అధ్యయనంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించి క్లిష్టమైన పాఠ్యాంశాలను అర్థమయ్యేలా తిరిగి బోధిస్తున్నారు. చాలా పాఠశాల్లో ఇప్పటికే సిలబస్ పూర్తి చేశారు. దీంతో ప్రత్యేక పరీక్షలను నిర్వహించి, విద్యార్థుల్లో ఉన్న భయందోళనను పోగొడుతున్నారు. ఆయా పాఠ్యాంశాలపై వారాంతంలో విద్యార్థులకు స్లిప్ టెస్ట్‌లు నిర్వహించనున్నారు.

ప్రత్యేకంగా ప్రశ్నలు రూపొందించి..

ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనే ఉపాధ్యాయులు ప్రతి సబ్జెక్ట్‌కు సంబంధించి ప్రత్యేకంగా ప్రశ్నలు రూపొందించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. అదనపు తరగతుల సమయంలో విద్యార్థులకు ప్రభుత్వం అల్పాహారం సైతం అందిస్తుంది. గతంలో జరిగిన తప్పిదాలను దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ అధికారులు గత సెప్టెంబర్ చివరి వారం నుంచి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. ప్రస్తుతం సాయంత్రం 4.15 గంటల నుంచి 5.15 వరకు నిర్వహిస్తున్నారు.

రోజుకో సబ్జెక్ట్‌పై రివిజన్..

ప్రత్యేక తరగతుల సమయంలో రోజు సబ్జెక్ట్‌కు సంబంధించి పాఠ్యాంశాలను రివిజన్ చేయడంతో పాటు పరీక్షలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్నారు. విద్యార్థులు సామర్థ్యాలను పెంపొందిస్తున్నారు. పరీక్షల్లో తక్కువగా మార్కులు సాధించిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

ప్రతిరోజు ప్రత్యేక తరగతులు..



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు రోజుకు రెండున్నర గంటలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్ట్‌ల్లో సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అలాగే అల్పాహారం కూడా అందిస్తున్నారు. ప్రతి రోజు పరీక్షలు నిర్వహిస్తున్నారు.

-జాన్సీ పదో తరగతి, మానవపాడు

సబ్జెక్ట్ వారీగా పరీక్షల నిర్వహణ..



సబ్జెక్ట్ వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు పరీక్షలు నిర్వహించి మార్కులు తెలియజేస్తున్నారు. మార్కులు తక్కువగా వచ్చిన విద్యార్థులు సబ్జెక్ట్ వారీగా సామర్థ్యాలను పెంపొందించుకోని ఎక్కువ మార్కులు తెచ్చుకోవడానికి ఉపయోగపడుతుంది.

- విద్యారాణి పదో తరగతి, మానవపాడు

లక్ష్యాన్ని నిర్దేశించాం..

మండలంలోని ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ఒక లక్ష్యాన్ని నిర్ణయించాం. ఈ మేరకు చేరుకోవాలని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించాం. ఆయా పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. రివిజన్ ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. వంద శాతమే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

- శివప్రసాద్ ఎంఈఓ, మానవపాడు

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



గద్వాలలో మాట్లాడుతున్న సీఐ శ్రీను

గద్వాల క్రైం: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గద్వాల సీఐ శ్రీను అన్నారు. బుధవారం పట్టణంలోని సైబర్ మోసాలపై విద్యార్థులచే ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాలు వాట్సాప్, ఇన్‌స్ట్రాగాం, ఫేస్‌బుక్, టెలిగ్రామ్ వంటి వాటిలో వచ్చే ప్రకటనలు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయనే ప్రకటనల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓటీపీలు చెప్పడం అనుమానిత మెసేజ్‌లపై క్లిక్ చేయకూడదని తెలిపారు. అత్యవసర సమయాల్లో 1930ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలపై అవగాహన..

అలంపూర్ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం సైబర్ జాగృక్త దివస్ నిర్వహించారు. ఎస్‌ఐ వెంకటస్వామి మాట్లాడుతూ... సైబర్ నేరాలకు గురైన వారు తక్షణమే 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అప్రమత్తంగా ఉంటేనే సైబర్ నేరాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఎస్ఎం బాష, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



మల్దకల్‌లో బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక

మల్దకల్ : బాలల హక్కులపై బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, మండల పరిషత్, తాటికుంట జెడ్పీహెచ్ఎస్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక హాజరై మాట్లాడారు. బేటీబచావో...బేటీ పడావో శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. బాలికలకు రక్షణ, సంరక్షణ కల్పించేందుకే బాలరక్ష ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. బాలలందరూ స్వేచ్ఛా వాతవరణంలో పెరగాలని, లైంగిక వేధింపులు ఎదురైన, బాల్య వివాహాలపై 100 లేదా 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీసీఎస్ ప్రకాష్, ఉమెన్ హబ్ సభ్యులు చిట్టెమ్మ, కేజీబీవీ స్పెషలాఫీసర్ విజయలక్ష్మీ, హెచ్ఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన..

మానవపాడు : మండలంలోని పల్లెపాడు యూపీఎస్ పాఠశాలలో బుధవారం మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఎత్తం శివ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యం పిల్లల హక్కుని.. పిల్లలు స్వేచ్ఛగా పెరగాలన్నారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టం తదితర చట్టాలు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, నారాయణమ్మ, అంగన్‌వాడీ టీచర్ మాణిక్యమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీసేందుకు దోహదం



సబ్జెక్ట్ మేళా ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

కేటీదొడ్డి: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సబ్జెక్ట్ మేళా ఎంతో ఉపయోగపడుతుందని హెచ్ఎం వెంకటేష్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని పాతపాలెం, ఈర్లబండ పాఠశాలలో ఎంవీ ఫౌండేషన్, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి సబ్జెక్ట్ మేళా పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీష్, గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్ట్‌ల వారీగా మూడో తరగతి నుంచి ఐదో తరగతి పిల్లల వివిధ రకాలైన టీఎల్ఎం మెటీరియల్ ప్రదర్శించి వాటి గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ప్రవీణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హనుమంతు, గోపాల్ రెడ్డి, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీడీపై అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన



మాట్లాడుతూన్న వైద్యాధికారి ప్రియాంక

అలంపూర్ రూరల్ : మండల పరిధిలోని అలంపూర్ సెక్టార్, లింగన్‌వాయి సెక్టార్‌లోని అంగన్‌వాడీ టీచర్లకు బుధవారం ఎన్‌డీడీపై క్యాతూర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి ప్రియాంక మాట్లాడుతూ.. ఈనెల 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నామన్నారు. 1 నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లలు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. 10వ తేదీ అందబాటులో లేని చిన్నారులకు 17న వేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. మండల పరిధిలోని 10,096 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సత్యనారాయణ, హెచ్ఏ బాలీశ్వరయ్య శెట్టి, సూపర్‌వైజర్ బాలమ్మ, ఏఎన్ఎం సులోచనా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు తక్షణమే ఇళ్లు అప్పగించాలి

గద్వాల: లాటరీ ద్వారా కేటాయించిన లబ్ధిదారులకు లక్షణమే డబుల్ బెడ్రూం ఇళ్లు అప్పగించాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున జిల్లా కలెక్టర్ సంతోష్‌కు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కురువ విజయ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని దౌదర్‌పల్లి సమీపంలో గత కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు తక్షణమే అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రతాప్ రెడ్డి, రాము, తిమ్మప్పగౌడ్, బజారి, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ పూజలు



అలంపూర్ రూరల్ : పట్టణంలోని న్యూప్లాట్స్ బీసీ కాలనీలోని శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం గోపూజ, గణపతి పూజ, ద్వార పూజ, దీక్షాహోమం, గణపతి హోమం చేశారు. 7వ తేదీ ధ్వజస్తంభ ప్రతిష్ఠ, లింగమన్న, నవగ్రహ నాభిశిల ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం దాతలను అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేశారు. ఈనెల 9న 1008 కలశాలతో రామలింగేశ్వరుని స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, శివ మాలాధారులు, భక్తులు పాల్గొన్నారు.

సైన్స్‌డే వాల్‌పోస్టర్ విడుదల



అయిజ: జాతీయ సైన్స్‌డే- 2025 సందర్భంగా ఈనెల 22న నిర్వహించనున్న కాంప్లెక్స్ లెవల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ సంబరాలకు సంబంధించిన వాల్ పోస్టర్ల బుధవారం మండలంలోని ఉప్పల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం బలరాం మాట్లాడారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోనే మొట్ట మొదటిసారిగా ఫిజికల్ సైన్స్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు చందాలు వేసుకుని విజేతలైన విద్యార్థులకు రూ.36 వేల నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఈనెల 10వ తేదీ కాంప్లెక్స్ లెవల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ మోడల్ పేపర్‌ను కూడా విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఎస్‌టీ కన్వీనర్ జైపాల్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నాణ్యత విషయంలో రాజీపడొద్దు



కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

మానవపాడు: మండలంలోని కేజీబీవీ పాఠశాల ఆవరణలో రూ.3.25కోట్లతో నూతనంగా నిర్మించనున్న కేజీబీవీ కళాశాల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే విజేయుడు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాల నిర్మించే కాంట్రాక్టర్లు నాణ్యతతో పనులు చేపట్టాలన్నారు. అదే విధంగా కళాశాలను 15 గదులు, కళాశాలకు ఇరువైపులా మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీజీఈడబ్ల్యుఐడీసీ డీఈ వెంకటరెడ్డి, ఎస్ఓ అనురాధ, నాయకులు దామోదర్‌రెడ్డి, గొల్ల వెంకట్రాములు, హరినాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వెల్పుల రవి, మాజీ సర్పంచ్ నరసింహులు, హుస్సేన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం వాసన వస్తే ఎలా ?

కేజీబీవీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా ఉడకలేదని, వాసన వస్తుందని ఇలా అయితే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే విజేయుడు మండిపడ్డారు. నాణ్యతపై ఏజెన్సీ సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం కేజీబీవీ కళాశాల భూమిపూజ చేసిన అనంతరం కేజీబీవీ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులు అందరూ మనవాళ్లే అని విద్యార్థులు ఉడకని వాసన వస్తున్న అన్నం ఎలా తింటారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో భోజనం అందించాలని ఆదేశించారు. వేసవి సమీపిస్తుండటంతో ఫిల్టర్ మిషన్ పనిచేయడం లేదని ఇంతవరకు అధికారుల దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. ఈ విషయంపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లానని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాల మౌలిక వసతులకు తమ వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యత లేకుంటే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ అనురాధ, నాయకులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

అనంతరం ఇటీవల మండల కేంద్రానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని హామీనిచ్చారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గద్వాల : గతంలో లాటరీ పద్ధతిలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడికి డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గద్వాల జిల్లా కేంద్రంలోని సంఘాల చెరువు వద్ద 1,275 గోన్‌పాడు గ్రామం వద్ద 25 ఇళ్లను ఇల్లులేని పేదల కోసం, ఇళ్ల స్థలాలు కోల్పోయిన పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్మించిందని వాటికి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు ఎంపిక చేసి సంవత్సరం పూర్తయిన పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నర్సింహ, రాముడు, సాదిక్, ఆంజనేయులు, జమున తదితరులు పాల్గొన్నారు.

పోరాట కలను ప్రభుత్వం నెరవేర్చింది



అయిజలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



అలంపూర్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

అయిజ : మూడు దశాబ్దాల మాదిగల పోరాట కలను ప్రభుత్వం నెరవేర్చిందని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు ఆమోదం తెలిపిన సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు కట్టుబడి దేశంలో మెట్టమెదటిసారిగా తెలంగాణలో ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప, డైరెక్టర్ సులోచనమ్మ, కాంగ్రెస్ నాయకులు జయన్న, దేవరాజు, ఆర్ శ్రీధర్, మహబూబ్ బాషా, దేవేంద్ర, బైనర్ బాబు, రాజు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు : మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ యువజన నాయకుడు పురుసోత్తం ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ నివేదికను అసెంబ్లీలో ఆమోదానికి సమ్మతం తెలిపినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం..

అలంపూర్ : పట్టణంలోని గాంధీ చౌక్‌లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. కేంద్ర వార్షిక బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకు ఇన్‌కం ట్యాక్స్ మినహాయింపు, కిసాన్ క్రెడిట్ నిధులు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధురవాణి, శరత్ బాబు, నాగమల్లయ్య, ఈశ్వర్, మద్దిలేటి, మహేష్, పరశురాముడు, కృష్ణ, సత్యారెడి తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్ : ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి శాంతినగర్‌లో బుధవారం పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కేంద్ర బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంజి, తాయన్న, రాము, నాగరాజు, రవి, శేఖర్, శివ, ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేంద్రం బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, విజయ్, పరుశరాం తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అంజన్న బ్రహ్మోత్సవాలు



కృష్ణానదిలో ఉత్సవ విగ్రహాలకు అవభృత చేయిస్తున్న వేద పండితులు

ధరూరు : పెద్ద చింతరేవుల శ్రీఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం స్వామి వారి అవభృత స్నానం, అలంకరణ, పల్లకిసేవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన భక్తులు మొక్కులు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓ కవిత, ధర్మకర్త గిరిరావు తెలిపారు.

గెలుపోటములు సహజం..

పెద్ద చింతరేవుల శ్రీఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తనయుడు బండ్ల సాయి సాకేత్‌రెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. గెలుపు ఓటములన్నవి సహజమని, ఓటమి గెలుపునకు పునాది లాంటిదన్నారు. గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, కురుమన్న, నవీన్‌రెడ్డి, భగీరథ వంశీ, కొత్త గణేష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తుంది



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య

అయిజ: కులగణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తుందని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. కులగణనలో బీసీలను తక్కువ చేసి చూపించడం బీసీలను మోసం చేయడమే అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభా తగ్గిపోయి కేవలం ఒక వర్గం జనాభా ఎట్లా పెరుగుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే అశాస్త్రీయంగా, తప్పుల తడకగా ఉందన్నారు. కులగణన సర్వేలో తప్పులను సరి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మత్తాలి, దగ్గుపాటి తిరుమలేష్, చిన్న రాయుడు పాల్గొన్నారు.